క్లుప్తంగా

నక్కపేటలో ఉచిత వైద్యశిబిరం

ఎచ్చెర్ల: లావేరు మండలం పెద్దరావుపల్లి పంచాయతీ నక్కపేట గ్రామంలో చిలకపాలెంలోని శివానీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాగోలు జెమ్స్ వైద్యులు కాత్యాయిని, మోహన్‌పద్మలు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు రిఫర్ చేశారు. 80 మందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో బి.ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ కె.శ్రీనివాసరావు, పీడీ బాలాజీరావు, జెమ్స్ ఎగ్జిక్యూటివ్ తేజ, శివానీ పాల్గొన్నారు.

చురుగ్గా కాలువ పనులు



కాలువ పనులు జరుగుతున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాక గ్రామంలో పెండింగ్‌లో ఉన్న కాలువ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. మలిపెద్దివారి వీధిలో మాడుగుల ప్రభాకర్ ఇంటి నుంచి కృష్ణారావు ఇంటి వరకూ ఇరువైపులా కాలువ నిర్మాణాలను చేపడుతున్నారు. దీనికి సంబంధించి పనులను సచివాలయం కన్వీనర్ బాలి శ్రీనివాసనాయుడు, గ్రామ నాయకుడు పెయ్యిల లక్ష్మణరావు, తేనెల విద్యాసాగర్ పర్యవేక్షిస్తున్నారు.


ఎంపీడీవోగా వెంకన్నబాబు



వెంకన్నబాబును సత్కరిస్తున్న సిబ్బంది

జి.సిగడాం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె.వెంకన్నబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన కె.రామకృష్ణరాజు పాతపట్నం బదిలీపై వెళ్లారు. వెంకన్నబాబు మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు. ఎంపీడీవోను సిబ్బంది సత్కరించారు.

వైభవంగా చౌడేశ్వరీ దేవి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలకంరణలో చౌడేశ్వరీ దేవి

గార: అంపోలు దేవాంగుల వీధిలోని చౌడేశ్వరీ దేవి వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఏటా మాదిరిగా అమ్మవారికి అర్చకులు ఆరవెల్లి శ్యాంబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చౌడీశ్వరిదేవి భజన బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో సెంట్రల్ పీఎఫ్ కమిషనర్



వైశాలికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సౌత్‌జోన్ సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ వైశాలీ దాయల్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో జిల్లా పీఎఫ్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గార : కొత్తూరు సైరిగాం గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు పోలాకి లీలారావుకు చెందిన ఏడు ఎకరాల వరి పంటకు చెందిన గడ్డి పూర్తిగా కాలిపోయింది. ఘటనకు గల కారణం తెలియలేదు. శ్రీకాకుళం నుంచి అగ్నిమాపక వాహనం వచ్చేసరికి గడ్డివాము కాలిపోయిందని, విలువ సుమారు రూ.20వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

విజయగణపతికి అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

నగరంలో నిఘా

- నైట్ గస్తీల్లో 17 బీట్ బృందాలు సహా ఎస్ఐలు, సీఐలు
- చోరీలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన



రాత్రి గస్తీల్లో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న టూటౌన్ సీఐ ఉమామహేశ్వరరావు



గస్తీలో భాగంగా రిజిస్టర్ పరిశీలిస్తున్న రూరల్ సీఐ సన్యాసినాయుడు

శ్రీకాకుళం క్రైమ్ :

నగరంలో చోరీలు జరగకుండా పోలీసులు నిఘా పెంచారు. రాత్రిపూట తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. పట్టణాలకు, తీర్థయాత్రలకు, దూరప్రాంత ప్రయాణాలు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ఈ తనిఖీలకు సంబంధించి శ్రీకాకుళం ఒకటో పట్టణ, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ల సీఐలు లెంక సన్యాసినాయుడు, గుండుమోను ఉమామహేశ్వరరావు మీడియాకు వివరించారు. ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు రాత్రి పూట గస్తీలు పెంచామని, లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దేవాలయాలు, బ్యాంకులు, ఏటీఎంలు, షాపింగ్‌మాళ్లు ఉన్న చోట మరింత నిఘా పెట్టామన్నారు. ఒకటో పట్టణ సర్కిల్ పరిధిలో ఆరు బీట్లు (ఒక్కో బీటుకు ఇద్దరు పీసీలు), రూరల్ పరిధిలో ఐదు బీట్లు, రెండో పట్టణ సర్కిల్ పరిధిలో ఆరు బీట్లు కలిపి మొత్తంగా 17 బీట్ బృందాలు తిరుగుతున్నాయని వివరించారు. వీరితో పాటు ఆరుగురు ఎస్ఐలు(గార, శ్రీకాకుళం రూరల్, శ్రీకాకుళం వన్‌టౌన్, శ్రీకాకుళం టూటౌన్) రెండు సర్కిళ్ల పరిధిలో రోజు తప్పించి రోజు రొటేషన్ పద్ధతిలో పాల్గొంటుండగా సబ్ డివిజన్ పరిధిలో తాము కూడా గస్తీ కాస్తున్నామన్నారు. డీఎస్పీ శృతి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారని, ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేస్తుంటారని పేర్కొన్నారు.

ప్రజల సహకారం అవసరం..

- ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తే చోరీలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయొచ్చని సీఐలు పేర్కొన్నారు.
- ప్రయాణాలకు వెళ్లేటప్పుడు ఇంట్లో విలువైనవి ఉంటే తప్పనిసరిగా పోలీసులకు సమాచారమిస్తే ఎల్‌హెచ్ఎంఎస్ సీసీ ఫుటేజీ లింక్ ఏర్పాటు చేసి సిబ్బందితో ఇంటిపై నిఘా పెడతారు.
- విలువైన బంగారు ఆభరణాలు, నగదు, భూమి పత్రాలు, ఇతరత్రా వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. లేదంటే వెంట తీసుకువెళ్లాలి. అప్పటికీ కుదరకపోతే పక్కింటివారు, నమ్మకస్తుల వద్ద దాచుకోవాలి.
- కొంతమంది బయట గేట్లకు మాత్రమే తాళాలు వేస్తూ ఇంటిడోర్‌ను లాక్ చేయడం లేదు. బీరువాలకు తాళాలు ఉంచి మరిచిపోతున్నారు. కొన్నిసార్లు పరుపులు, దిండులు కింద తాళాలు ఉంచేస్తున్నారు. దీంతో దొంగల పని సులువవుతోంది. ఈ పద్ధతులు మంచివి కావు.
- లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఇళ్లకు కనీసం సీసీ కెమెరాలు పెట్టుకోకపోవడం సరి కాదు. ఒక సీసీ కెమెరా వెయ్యిమంది పోలీసులతో సమానమనే విషయం గుర్తుంచుకోవాలి.
- రాత్రి పదిగంటల తర్వాత నగరంలో గానీ, రూరల్ పరిధిలో గానీ ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. తెలిసిన వారైనా ఆ సమయం దాటి తిరిగితే వారి వద్ద సరైన కారణం (ఐడెంటిటీ కోసం) పోలీసులకు చూపించాల్సి ఉంటుంది.
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని లాడ్జీల యాజమాన్యాలు పసిగడుతూ పోలీసులకు సమాచారమివ్వాలి. లాడ్జీల్లో దిగేవారి వద్ద గుర్తింపు కార్డులు, సరైన వివరాలు తీసుకోకపోతే యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవు.
- కొన్ని ప్రదేశాల్లో ఒంటరిగా నివాస గృహాలున్న వారు తప్పనిసరిగా సీసీ కెమెరాలు పెట్టుకోవాలి. అపార్ట్‌మెంట్లు, షాపింగ్‌కాంప్లెక్సులు, దేవాలయాలు, ముఖ్య కూడళ్లు, కాలనీల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి.
- మద్యం దుకాణాలు, బార్ల వద్ద గంటల తరబడి మద్యం సేవిస్తూ అర్ధరాత్రి సమయాన అలజడులు సృష్టించినా, పరిసర గృహాలవారికి అంతరాయం కలిగించినా పోలీసు కేసులు తప్పవు.

దిద్దుబాట్లు ఉంటే సహించం

- ఎన్ఆర్ఈజీఎస్ పీడీ చిట్టిరాజు



మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొన్న వేతనదారుల హాజరుకు సంబంధించి సర్దుబాట్లు, దిద్దుబాట్లు ఉంటే సహించేది లేదని ఎన్ఆర్ఈజీఎస్ పీడీ చిట్టిరాజు స్పష్టం చేశారు. లావేరు మండల కేంద్రంలో ఉపాధి పనులకు సంబంధించి ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లావేరు మండలంలో చేపడుతున్న పనుల్లో చాలాచోట్ల వేతనదారుల హాజరులో సర్దుబాట్లు, దిద్దుబాట్లు చేసినట్లు తేలిందన్నారు. వేతనదారులకు గిట్టుబాటు వేతనం వచ్చేలా పనిని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పనులు చేసే సమయాన్ని విధిగా పాటించాలని అన్నారు. గత ఏడాది 49.91 వేల మందికి పని దినాలను కల్పించగా.. ఈ ఏడాది 1.17 లక్షల మందికి పనిదినాలు కల్పించినట్లు పేర్కొన్నారు. వంద రోజులు పనిని విధిగా కల్పించాలని అన్నారు. లావేరు మండలంలో ఇప్పటివరకూ ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 18.3 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఇందులో రూ. 15.23 కోట్లు వేతనదారులకు, రూ. 2.80 కోట్లు మెటీరియల్ కోసం ఖర్చు చేయడం జరిగిందని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేతనదారులకు రోజుకు 272 రూపాయలు గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. జూలై నెల వరకూ రోజుకు ఎనిమిది గంటలు పని చేసేలా చూడాలని సిబ్బంది ఆదేశించారు. ఉపాధి పనులకు వచ్చే వేతనదారులకు శ్రమ తెలిసేలా పనిని కల్పించాలన్నారు. శ్రమ తక్కువ ఉండటం వలన వ్యవసాయ పనులకు వెళ్లకుండా ఉపాధి పనుల వైపు వారు మొగ్గు చూపుతున్నారని.. దీనివలన రైతులు కూలీలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందువలన ఉపాధి పనులతో పాటు రైతుల పనులకు కూడా ప్రాధాన్యతనిచ్చేలా వేతనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కొత్తవారికి జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంక్‌ఖాతాలు ఉన్న వారికి జాబ్‌కార్డులు అందించి వందరోజుల పనిని కల్పించాలన్నారు. ఏ గ్రామంలో పనిని చేపట్టిన, సమస్య ఉన్నా ఆ గ్రామంలో సచివాలయం సిబ్బందితో సంతకాలు చేయించుకుని నిర్ధారణ చేసుకోవాలని తెలిపారు. హాజరు తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. దగ్గర ఉన్న పీహెచ్‌సీల్లో వైద్యసిబ్బందితో మాట్లాడి వేతనదారులకు కావాల్సిన వైద్య సౌకర్యాలను అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని అన్నారు. స్వచ్ఛంద వైద్యసేవలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి డీవీవీ లవరాజు, ఏపీడీ మురళీకృష్ణ, హెచ్ఆర్ మేనేజర్ శ్రావణ్, ఏపీవో ఎ.సత్యవతి, ఎస్ఆర్‌పీ ఎం.గోవిందరావు, జేఈలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

బూత్ లెవెల్ కార్యకర్తలే కీలకం



హాజరైన ఎమ్మెల్యే కిరణ్, పార్టీ శ్రేణులు

రణస్థలం: వైఎస్సార్‌సీపీ గెలుపులో బూత్ లెవెల్ కార్యకర్తలే కీలకం కానున్నరని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో మంగళగిరిలో మంగళవారం నిర్వహించిన 'మేము సిద్ధం – మాబూత్ సిద్ధం' కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. ఎన్నికలకు సిద్ధంగా ఉండాల్సిన అంశాలపై సమగ్రంగా పార్టీ శ్రేణులకు సీఎం జగన్ దిశానిర్దేశం చేశారన్నారు. మంగళగిరి వెళ్లిన వారిలో మండల నాయకులు మురళీధర్ బాబా, దన్నాన రాజినాయుడు, ముద్దాడ శంకర్, చిల్ల వెంకటరెడ్డి, మీసాల శ్రీనివాసరావు, మూగి శ్రీరాములు, డోల వెంకటరమణ, ఆబోతుల జగన్నాథం, మహంతి చినరామినాయుడు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో పలు కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని గేదెలవానిపేట, కసిమివలస గ్రామానికి చెందిన సుమారు 20 కుటుంబాలు యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు సమక్షంలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన పట్ల ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. అర్హత గల ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. గేదెలవానిపేట సచివాలయం పరిధిలో సంక్షేమ కార్యక్రమాల పేరిట ప్రభుత్వం రూ.22 కోట్ల 60లక్షలు ఖర్చు చేసినట్లు వివరించారు. టీడీపీ హయాంలో కమీషన్లు ఇస్తేనే పనులు జరిగేవని, జగనన్న పాలనలో అటువంటి వాటికి ఆస్కారం లేదన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను చేరువ చేస్తున్నామని చెప్పారు. చంద్రబాబు మరోసారి మోసపూరిత హామీలతో ప్రజలను వంచించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆయన మాటలను నమ్మవద్దని హితవుపలికారు. ధర్మాన ప్రసాదరావును మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీవలసలో వైద్య సేవలు

జి.సిగడాం: మండలంలోని టంకాల దుగ్గివలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జి.సిగడాం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రోగులను పరీక్షించి మందులు అందించారు. వైద్యాధికారి బుడుమూరు యశ్వంత్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు వస్త్రాల వితరణ



నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: సేవా తత్పరుడు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు అని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు సోమేశ్వరరావు జన్మదినం సందర్భంగా కలెక్టర్ కార్యాలయం రోడ్డులో ఉన్న శాంతా కల్యాణ్ అనురాగ నిలయంలో చిన్నారులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిక్కు అప్పన్న, విశ్రాంత డీఈఓ మల్లేశ్వరరావు, ఐతమ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, అనురాగ నిలయం సిబ్బంది, భాగ్యసుధ చైల్డ్ సెంటర్ సిబ్బంది బబ్లూ, ఇబ్రహీం, వరం తదితరులు పాల్గొన్నారు.

భద్రమ్మతల్లికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రమ్మతల్లి

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని భద్రమ్మతల్లి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవకులు ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి ముడుపులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఓటర్ జాబితాపై ప్రత్యేకదృష్టి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఓటర్ల జాబితాపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. నియోజకవర్గంలో 309 పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారులు ఓటరు జాబితాలపై దృష్టిపెట్టారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 37 మంది సెక్టార్ అధికారులను నియమించారు. ప్రధానంగా ఓటర్ జాబితా నుంచి మృతులను తొలగించటం, అర్హత గల కొత్త ఓటర్ల చేర్పు, ఓటర్ల చిరునామాను పక్కాగా పరిశీలిస్తున్నారు. మరోపక్క రాజకీయ పార్టీల నాయకుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. నియోజక వర్గ స్థాయిలో నిరంతరం ఎన్నికల ఇన్‌చార్జిలు పర్యవేక్షిస్తున్నారు. పక్కాగా ఓటర్ జాబితాలు కూర్పు, పోలింగ్ నిర్వహణ రెండింటిపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఎన్నికలు నోటిఫికేషన్ వచ్చి నామినేషన్ల స్వీకరణ వరకు అర్హులకు ఓటు హక్కు కల్పిస్తారు.

చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న ఎంపీపీ గొండు రఘురామ్

గార: ప్రతిపక్షనేత చంద్రబాబు తన పాలనలో శ్రీకాకుళం జిల్లాకు చేసిందేమీ లేదని రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు, ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. మంగళవారం గారలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ప్రాజెక్టులున్నా శ్రీకాకుళాన్ని ఎందుకు విస్మరించారో చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి చేసిన మంత్రి ధర్మాన ప్రసాదరావుపై విమర్శలు చేయడం తప్పా చేసిన మేలును చెప్పలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రి ధర్మాన హయాంలోనే అంబేడ్కర్ యూనివర్సిటీ, వంశధార కాలువలు, రిమ్స్ ఆసుపత్రి, మెడికల్ కళాశాల, నలుమూలలా బ్రిడ్జిల నిర్మాణం జరిగాయని, ఆఖరికి మీరు పెట్టిన సభ 80 అడుగుల రోడ్డు కూడా ధర్మాన చొరవేనని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు ప్రజలు అందుకోవడం వల్లే ఆర్థిక స్వేచ్ఛ జరిగిందన్నారు. నవరత్నాలుతో అన్ని వర్గాలు, ప్రాంతాలు అభివృద్ధి సాధించాయని చెప్పారు. పైసా అవినీతి లేకుండా వలంటీర్లు సేవ చేస్తే వారిని కూడా విమర్శించడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. సమావేశంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, సర్పంచ్ పీస శ్రీహరిరావు, బోర రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మార్టులతో మహిళాభ్యున్నతి



మాట్లాడుతున్న మెప్మా డైరెక్టర్ విజయలక్ష్మి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మహిళల అభివృద్ధికి జగనన్న మహిళా మార్ట్‌లు ఎంతగానో దోహదపడుతున్నాయని మెప్మా డైరెక్టర్ వి.విజయలక్ష్మి అన్నారు. శ్రీకాకుళం నగరంలో రైతు బజారు వద్ద జగనన్న మహిళామార్ట్ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా మార్ట్‌ను నగరపాలక సంస్థలోని స్వయం సహాయక సంఘాల సభ్యుల రూ.150 వాటాధనంతో ప్రారంభించినట్లు చెప్పారు. మొత్తం వాటా ధనం రూ.27.54 లక్షలు కాగా, నేటికి నికర ఆదాయం రూ.13.63 లక్షలు రావడం అభినందనీయమన్నారు. వచ్చిన నికర ఆదాయంలో 35% డివిడెంట్ రూ. 9.18 లక్షలను సంబంధిత స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేసినట్లు చెప్పారు. రిసోర్స్ పర్సన్లు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. రాష్ట్రంలో ఏ పథకం అమల్లో అయినా శ్రీకాకుళం జిల్లా మొదటి స్థానంలో ఉంటుందన్నారు. పలాసలో మరో మార్ట్ ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, మెప్మా ప్రధాన కార్యాలయం అధికారి ఆర్.ఆదినారాయణ, ఎస్ఎస్ఆర్ శ్రీనివాస్‌రావు, అంజనేయులు, లక్ష్మీనారాయణ, శ్రీకాకుళం నగరపాలక సంస్థ, మెప్మా సిబ్బంది, టౌన్‌లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షులు, రిసోర్స్ పర్సన్లు, మహిళా మార్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతికి సంతాపం



నర్సింగరావు (ఫైల్)

జి.సిగడాం: పాలఖండ్యాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రాయపురెడ్డి నర్సింగరావు మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే పార్టీ శ్రేణులు గ్రామానికి చేరుకొని నర్సింగరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ ధారబోయిన రెయిమ్మ, వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ రాయపురెడ్డి సూర్యనారాయణ, ఉప సర్పంచ్ ఇజ్జి గోవిందరావు, జిల్లా నాయకులు పిల్లల శివకుమార్, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, ధారభోయిన ధర్మారాజ్, పెద్ది భాస్కరరావు తదితరులు నర్సింగరావు మృతికి సంతాపం తెలియజేశారు.

రామశేషు విగ్రహావిష్కరణ నేడు

గార: వైఎస్సార్ సీపీ నాయకుడు, దివంగత వైస్ ఎంపీపీ బరాటం రామశేషు కాంస్య విగ్రహావిష్కరణ బుధవారం సాయంత్రం నిర్వహించనున్నామని తండ్రి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రామశేషు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నిజాయితీపరులను గెలిపిద్దాం



ఓటర్ల చైతన్య కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్:

స్వేచ్ఛగా జీవించాలంటే నిజాయితీపరులకే ఓటు వేద్దామని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో సిటిజన్ ఫర్ డెమొక్రసీ ఆధ్వర్యంలో ఓటు వేద్దాం అనే నినాదంతో రాష్ట్రస్థాయి కళాజాత బృందంతో ఓటర్ల చైతన్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధన రాజకీయాలకు స్వస్తి పలికి ఆదర్శవంతమైన నాయకులను ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, డాక్టర్ బాడన దేవభూషణరావు, సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సెల్ కన్వీనర్లకు సన్మానం



లీగల్ సెల్ ప్రతినిధులను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్ : వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదర్‌రావు, జై భారత్ నేషనల్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్, అధికార ప్రతినిధి చౌదరి లక్ష్మణరావు పదవులు పొందడం గొప్ప విషయమని శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు అన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, న్యాయవాదులు, కూన అన్నంనాయుడు, అప్పారావు పట్నాయక్, జె.శ్రీనివాసరావు, బెహరా తిరుమలరావు, పైడి విశ్వేశ్వరరావు, ఇప్పిలి సీతారాజు, మహిళా న్యాయవాదులు పైడి అన్నపూర్ణ, మజ్జి సుధాబాల పాల్గొన్నారు.

వెంకటస్వామికి పురస్కారాలు



పురస్కారాలతో మంత్రి వెంకటస్వామి

శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం: విశ్వజ్యోతిష విజ్ఞాన సంస్థ, మహర్షి జ్యోతిష పరిశోధన సంస్థ విద్యా కేంద్రం(చెన్నై) సంయుక్తంగా నిర్వహించిన జ్యోతిష స్నాతకోత్సవ సభలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన డాక్టర్ మంత్రి వెంకటస్వామి జ్యోతిష పట్టభద్రుల పట్టాలు అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 24 నుంచి 27 వరకు జరిగిన ఈ ఉత్సవంలో జ్యోతిదార్ సమృతి అవార్డు, జ్యోతిష పట్టభద్రుని పట్టా, అమెరికన్ హానరరీ డాక్టర్ రేట్ (హానరిస్‌కాసా అవార్డు)లను అందుకున్నట్లు పేర్కొన్నారు.

పరిమళకు మంజీరా నాట్య అవార్డు



అవార్డులతో లయశ్రీనృత్యనికేతన్ చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అరుణాచలం ఆలయంలో స్వామివారి సన్నిధిలో నిర్వహించిన ప్రదర్శనకు గాను శ్రీకాకుళానికి చెందిన లయశ్రీ నృత్య నికేతన్ దర్శకురాలు కె.పరిమళ హరిహర్‌ను మంజీరా నాట్య అవార్డుతో సత్కరించారు. నృత్య నికేతన్ చిన్నారులు శ్రీజ, నవ్యభరద్వాజ్, యశస్విని, స్వాతిసత్య, రేష్మ, కోటి నిషిత, రాగిణి లయశ్రీ, మోక్షశ్రీ, జయహర్ష, నైనేటి నిషిత, రుత్విక తేజశ్రీలు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. శిష్యబృందాన్ని ఆదియోగి అవార్డును సత్కరించారని పరిమళ తెలిపారు.